## క్లుప్తంగా

### పరామర్శ



గోవిందస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

నగరి : నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ గోవిందస్వామి ఇటీవల మరణించారు. ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కేరోజా గోవిందస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### వైభవంగా వార్షికోత్సవ పూజలు



బైరెడ్డిపల్లి: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం 19వ వార్షికోత్సవ పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం హోమం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ ఫౌండేషన్, కుసుమపుత్రి వింగ్స్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విశేష పూజల్లో భక్తులు

### మదినిండా సంతోషం...!



జెడ్పీ హైస్కూల్ స్వర్ణోత్సవంలో పూర్వ విద్యార్థులు

పూతలపట్టు (కాణిపాకం): ఎక్కడెక్కడి నుంచో వచ్చిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సంబరం అంబరాన్ని తాకింది. నాటి సంగతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందడోలికల్లో మునిగితేలారు. ఆదివారం పూతలపట్టులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 50 ఏళ్ల స్వర్ణోత్సవం కోలాహలంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. తమ అభ్యున్నతికి బాటలు వేసిన అప్పటి గురుదేవులు జయరామి నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, శకుంతలను ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులు పొందారు. అనంతరం 1974–75 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు రూ.15వేల విరాళం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ బాలాజీ, విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, విశ్రాంత జడ్జి చెంగల్రాయనాయుడు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గజ దాడుల శాశ్వత పరిష్కారానికి చర్యలు ప్లీజ్!

– అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతినాయుడు

బంగారుపాళెం: ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదివారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెక్రటరీకి వినతి పత్రాన్ని సమర్పించినట్లు ఏఐకేఎంఎస్ జిల్లా రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉపాపతినాయుడు, వెంకట్రామిరెడ్డి తెలిపారు. పలమనేరు పట్టణ సమీపంలో కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేయనున్న శిబిరాలను పరిశీలించేందుకు విచ్చేసిన రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ చిరంజీవిచౌదరిని రైతు సంఘ నాయకులు కలిశారు. జిల్లాలో ఏనుగు దాడుల వల్ల జరుగుతున్న పంట నష్టం, ఏనుగు దాడుల జరగకుండా రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరినట్లు చెప్పారు. తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాలోకి వచ్చిన ఏనుగులు గుంపులుగా విడిపోయి జిల్లాలోని అటవీ సరిహద్దు ప్రాంతాలైన కుప్పం, రామకుప్పం, పలమనేరు, బంగారుపాళెం, పులిచర్ల తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటలను, వ్యవసాయ బావుల వద్ద షెడ్లు, బోర్లను ధ్వంసం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రైతులు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునేందుకు 100 శాతం రాయితీ కల్పించాలని కోరామన్నారు. అలాగే ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలకు ప్రస్తుతం ఇస్తున్న పరిహారాన్ని రెండు రెట్లు పెంచి ఇవ్వాలని కోరినట్టు చెప్పారు.

# నులిమేద్దాం..!

చిన్నారుల జీవితాన్ని నులిపురుగులు నులిమేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దీనికి కారణమవుతున్న నులిపురుగులను కేవలం ఒకే మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నులి పురుగుల నిర్మూలన దినం పురస్కరించుకుని ప్రభుత్వం 19 ఏళ్లలోపు వారికి మొత్తం 24,348 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది.

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు
- నేడు నులి పురుగుల నిర్మూలన దినోత్సవం
- 1–19 ఏళ్లలోపు వారికి మాత్రమే మాత్రలు



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్ర వేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ(ఫైల్)

**మండలాల వారీగా నిర్దేశిత లక్ష్యం**

| | |
|---|---|
| గంగాధరనెల్లూరు | 6098 |
| శ్రీరంగరాజురం | 3142 |
| కార్వేటినగరం | 6819 |
| వెదురుకుప్పం | 5280 |
| పెనుమూరు | 5869 |
| పాలసముద్రం | 3009 |
| మొత్తం | 24,348 |



పాలసముద్రం: అపరిశుభ్రత వల్లే నులిపురుగులు సమస్య తలెత్తుతుంది. పిల్లలు ఎప్పుడూ చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. లేకుంటే వాటిల్లో పేరుకున్న మట్టి వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు తాగడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వల్ల కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడగకపోవటం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవటం వల్ల కూడా నులిపురుగుల ప్రభావం ఉంటుంది.

**రక్షణ కోసం ఇలా..**

బహిరంగ ప్రదేశాల్లో మల మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కాళ్లకు చెప్పులు ధరించాలి, పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. శుభ్రమైన నీటిని తాగాలి, పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగాక మాత్రమే వినియోగించాలి.

**అనర్థాలు ఇలా..**

నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగుజేస్తాయి. దీనివల్ల ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారిలో ప్రధానంగా నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

**ఇలా నివారించవచ్చు**



పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులి పురుగులు, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒకరోజు లేదా రెండురోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళతాయి.

– వైద్యాధికారి మోహన్‌కృష్ణ, పాలసముద్రం

**వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు వేయాలి**



ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్రను 200 మిల్లీగ్రాముల నీళ్లలో కలిపి ఇవ్వాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి 400 మిల్లీగ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. పాఠశాలల్లో టీచర్లు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఈ మాత్రలు నమిలి మింగించేలా చూడాలి.

– వినుతశ్రీ, గంగాధరనెల్లూరు ప్రాజెక్టు, సీడీపీఓ

**మాత్రలు పంపిణీ**



గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు మొత్తం 24348 మంది ఉన్నారు. వీరందరికీ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలను మింగిస్తాం. మాత్రలు అందుకోని వారికి స్పెషల్ డ్రైవ్ పెట్టి మాత్రలు ఇస్తాం.

– సీ హనుమంతరావు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్

### చెరువులో పడి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వెదురుకుప్పం : మండలంలోని బ్రాహ్మణపల్లె సమీపంలోని చెరువులో పడి చంద్రగిరి మండలానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు... చంద్రగిరి మండలం దోర్నకంబాల గ్రామానికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి(40), గురునాథ్‌రెడ్డి, ఆనందబాబు ముగ్గురు కలిసి ఆదివారం వెదురుకుప్పం మండలంలోని పాతగుంట గ్రామంలో జరిగిన ఎడ్ల పందేలను తిలకించేందుకు వచ్చారు. ఇంటికి తిరుగు ప్రయాణంలో బ్రాహ్మణపల్లె గ్రామానికి సమీపంలోని చెరువు వద్ద ఆగారు. అక్కడ శ్రీనాథ్‌రెడ్డి(40) ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడ్డాడు. పక్కనే ఉన్న ఇద్దరు మిత్రులు శ్రీనాథ్‌రెడ్డిని రక్షించే ప్రయత్నం చేయగా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఎస్ఐ వెంకటసుబ్బయ్య పుత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా చెరువులో గాలింపు చేపట్టి శ్రీనాథ్‌రెడ్డి మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

### అగ్నికి ఆహుతైన నీలగిరి చెట్లు

పుంగనూరు: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో నీలగిరి తోట దగ్ధమైన సంఘటన మండలంలోని మేలుందొడ్డి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు కథనం మేరకు.. మేలుందొడ్డి గ్రామానికి చెందిన ఇందిరమ్మ, రామరాజుకు చెందిన నీలగిరి తోటల్లో మంటలు రావడంతో గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

## ఆలయ జీర్ణోద్ధరణ..మహా కుంభాభిషేకం



రోజాను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు, పట్టణ ప్రజలు

పుత్తూరు: దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా అందరినీ చల్లగా దీవించయ్యా! అని మాజీ మంత్రి ఆర్కే రోజా సుందర గణపతి జీర్ణోద్ధరణ మహా కుంభాభిషేకంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్థానిక కాపువీధిలోని శ్రీసుందర వినాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, నూతన ఆలయ నిర్మాణ అష్టబంధన మహాకుంభాభిషేకంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, వేద పండితులు ఆమెకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన వైదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని హారతి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, పుత్తూరు పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షులు ఏకాంబరం, అన్నా లోకనాథం, కౌన్సిలర్లు రాధ, నరసింహా, గుణ, పవన్, వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మణమూర్తి, మనోహర్‌రెడ్డి, లారీ మోహన్, ప్రసాద్, ఈశ్వరయ్య యాదవ్, మురళీ యాదవ్, జయచంద్రన్, కుట్టి, సుబ్రమణ్యం, గోపి, చక్రి తదితరులు పాల్గొన్నారు.

**• రైల్వే గేటు కమ్మీల్లో చిక్కుకున్న ఆవు**



రైల్వే గేటు సమీపంలో ఉండే కమ్మీల్లో ఆవు చిక్కుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక మెసానికల్ మైదానం వద్ద రైలు గేటు ఉంది. స్థానిక పశువుల కాపరి ఆవు మేత కోసం అటువైపు తీసుకెళ్లాడు. ఆవు గేటు సమీపంలో మేత మేస్తూ వెళ్లి కాలుజారి కమ్మీల్లో ఇరుక్కుపోయింది. స్థానికుల సాయంతో గంట సేపు శ్రమించి ఆవును సురక్షితంగా వెలికి తీశారు. తదనంతరం ప్రథమ చికిత్స చేయించారు. – చిత్తూరు కార్పొరేషన్

## ఉరకలేసిన ఉత్సాహం

- కాలుదువ్విన కోడె గిత్తలు
- జగన్ నినాదంతో మారుమోగిన పాతగుంట



జన సందోహం

వెదురుకుప్పం: ఉత్సాహం ఉరకలేసింది... కోడె గిత్తలు రంకెలేశాయి...జనసమూహంలో దూసుకుపోయిన పోట్ల గిత్తలు తమ పౌరుషాన్ని చూపాయి. ఎడ్లను నిలువరించేందుకు యువత పోటీ పడింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని పాతగుంటలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. యువత కేరింతలు మధ్య జల్లికట్టు దుమ్ము రేపింది. యువత ఆధ్వర్యంలో గ్రామంలో పశువుల పందేల నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో కూడిన పలకలు, పార్టీ జెండాలతో కోడె గిత్తలను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత అక్కడికి చేరుకున్నారు. పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా యువత నిలబడడంతో నిర్వాహకులు ఎడ్లను ఉసిగొల్పారు. పోట్ల గిత్తలు రంకెలేస్తూ పరుగులు తీశాయి. వాటిని నిలువరించి పలకలు చేజిక్కించుకునేందుకు యువత పోటీ పడింది. కొందరు యువకులు కోడె గిత్తలను కట్టడి చేసి పలకలను దక్కించుకుని విజయ దరహాసంతో చిందులు వేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం జనంతో కిక్కిరిసింది. స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి, యువత ఏర్పాట్లు చేశారు.





దూసుకుపోతున్న కోడె గిత్తలు

### ముగ్గురు డాక్టర్లకు మెమోలు

చౌడేపల్లి: ప్రభుత్వాస్పత్రికి వైద్యసేవల కోసం వచ్చిన చిన్నకొండామర్రికు చెందిన షవ్యశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు వైద్యులకు శనివారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి మెమో జారీచేశారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన 'రోగిపై దురుసు ప్రవర్తన' కథనంపై ఆమె స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు నెలసరి సమస్యతో ఇబ్బంది పడుతున్న రోగి, వైద్యసేవల కోసం డాక్టర్ పూజకు వివరిస్తుండగా అదే గదిలో డాక్టర్ నవీన్‌తేజ్ ఉండడం, విధులు నిర్వహించకుండా సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ చూస్తుండగా సౌండ్ ఎక్కువగా ఉందని డాక్టర్ చెప్పేది వినపడడంలేదని రోగి అనడంతో రోగి పట్ల హేళనగా వ్యవహరించడంపై డీఎంహెచ్ఓ డాక్టర్‌ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 'దుమ్ము'..రోగాలు కమ్ము..!



దుమ్ము కమ్మేస్తున్న దృశ్యం

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలంలోని పోలీస్ స్టేషన్ నుంచి కనికాపురం వరకు రోడ్డు నిర్మాణ పనుల మూలాన రేగుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరువైపులా నివాసం ఉన్నవారు ప్రధానంగా అవస్థలు పడుతున్నారు. రోడ్డు పనుల కుగాను కంకర పోసి..దానిపై కంకర డస్ట్ చల్లి వదిలేశారు. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లిన ప్రతిసారీ ఆ దుమ్ము రేగుతూ రోడ్డుతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను కమ్మేస్తూండడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. దీనిపై స్థానికులు కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రోడ్డు పనుల్లో కంకర డస్ట్‌పై విధిగానీళ్లు పోసి రేగకుండా చూడాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు.

రోజురోజుకూ ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. ప్రతి నెలా విద్యుత్ బిల్లును చూసి వామ్మో..! ఇంత బిల్లు వచ్చిందా..? అని నోరువెళ్లబెట్టని వారు ఉండరు. అయితే సహజ వనరులను వినియోగించుకుని గుదిబండలాంటి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. మన ఇంట్లోనే సూర్యరశ్మి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. దీనికి రాయితీ ఇస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది.



# సూర్యఘర్‌తో ఇంట్లో వెలుగులు

- సౌర ఫలకాలతో ఇంట్లోనే విద్యుత్పత్తి
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి, వాడకం
- విద్యుత్ బిల్లు తగ్గించుకునేందుకు అవకాశం

నగరి: సూర్యఘర్ పథకం వినియోగించుకోవడానికి విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. చివరగా ఇంటి పైభాగంపై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ (సౌర ఫలకాలు) ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్తును లెక్కించే అవకాశం ఉంటుంది.

**30 రోజుల్లోనే సబ్సిడీ**

నెట్ మీటరు అమర్చిన తరువాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్(ఒక మీటరు వెడల్పు,1.6 మీటర్ల ఎత్తు) అమర్చుతారు. కిలో వాట్ సోలార్‌రూటార్ ప్యానల్ నెలకు దాదాపు 125పై యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూటాప్ ప్యానల్స్ సూర్యుడి వేడిని గ్రహించడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులు పెట్టుబడి 6 నుంచి 7 ఏళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెప్పారు.

**దరఖాస్తు చేసుకోవాల్సింది ఇలా..**

ఈ పథకం కింద ప్రయోజనం పొందాలంటే తొలుత సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంటు బిల్లుల కాపీలను జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

**పీఎం సూర్యఘర్ పథకం వివరాలు**

| వినియోగం (యూనిట్లలో) | సోలార్ కెపాసిటీ (కిలోవాట్‌లలో) | సబ్సిడీ |
|---|---|---|
| 0–150 | 1–2 | రూ.30 నుంచి రూ.60 వేలు |
| 150–300 | 2–3 | రూ.50 నుంచి రూ.78 వేలు |
| 300 లోపు | 3 | రూ.78 వేలు |

**ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం**

వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తోంది. 6–7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం మూలాన విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకటముని, ట్రాన్స్‌కో ఏడీఈ, నగరి